## క్లుప్తంగా

### లేఔట్లకు అనుమతి తప్పనిసరి



నిబంధనలకు విరుద్ధంగా వేసిన లేఔట్‌లో రాళ్లను తొలగిస్తున్న సిబ్బంది

**బేతంచెర్ల:** నగర పంచాయతీ అనుమతి లేకుండా పట్టణంలో లేఔట్లు వేస్తే చర్యలు తప్పవని కమిషనర్ రమేష్ బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా వేసిన లేఔట్‌లోని రాళ్లను నగర పంచాయతీ సిబ్బంది తొలగించారు. ప్రజలు అనుమతి ఉన్న లేఔట్లలోనే స్థలాలు కొనుగోలు చేయాలని.. లేకపోతే ఇళ్ల నిర్మాణాలకు అనుమతి ఇవ్వమని రమేష్ బాబు స్పష్టం చేశారు.

### మృతిచెందిన ఓటర్ల తొలగింపునకు చర్యలు



బీఎల్‌ఓలతో సమీక్షిస్తున్న తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి

**కోవెలకుంట్ల:** ఓటర్ల జాబితాలో మృతి చెందిన వ్యక్తుల పేర్లను తొలగించాలని తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి బీఎల్‌ఓలను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని బూత్‌లెవల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆయా గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి చనిపోయిన వ్యక్తులు, వివాహమై భర్త ఇంటికి వెళ్లిన మహిళల పేర్లను గుర్తించి జాబితా నుంచి తొలగించాలని సూచించారు. ఎలాంటి తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్‌ఐ ఇమ్రాన్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

### మోడల్ స్కూల్ సమస్యల పరిష్కారానికి కృషి



గోవిందును సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

**కొలిమిగుండ్ల:** మోడల్ స్కూళ్లలో పనిచేసే సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీ మోడల్ స్కూల్స్ స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గోవిందు అన్నారు. కొలిమిగుండ్ల మోడల్ స్కూల్‌లో పీజీటీ ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేస్తున్న గోవిందు నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా రెండు రోజుల క్రితం ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక పాఠశాలలో ఆయన్ను ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

### ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కంపెనీ ప్రతినిధులు

**ప్యాపిలి:** మండల పరిధిలోని బోంచెర్వుపల్లి, నేరేడుచెర్ల గ్రామాల్లో జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఏవీపీ సురంజన్ సర్కార్, జీఎంఅమిత్ కుమార్ మాట్లాడుతూ.. ఆర్‌ఓ ప్లాంట్ ద్వారా ప్రజలకు ఉచితంగా శుద్ధజలం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు 8 గంటల పాటు ప్లాంట్ ద్వారా నీటి సరఫరా చేస్తామన్నారు. నేరేడుచెర్ల, బోంచెర్వుపల్లి సర్పంచ్‌లు అనిల్ కుమార్, రాయుడు, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ ఉద్యోగులు మల్లికార్జున, సంతోష్, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ లేఔట్లలో ప్లాట్లు కొనొద్దు

**డోన్:** పట్టణ శివారులో మున్సిపల్ అనుమతులు లేకుండా వెలుస్తున్న వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోవద్దని కమిషనర్ డాక్టర్ జయరాం అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ.. చాలా మంది వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్పు చేసుకోకుండానే ప్లాట్లు వేసి విక్రయిస్తుండడం చట్ట విరుద్ధమన్నారు. కొనుగోలు చేసే వారు అన్ని అనుమతులు చూసిన తర్వాతనే కొనుగోలు చేయాలని సూచించారు. ఇటీవల 362-1 సర్వే నంబర్‌లో 5.40 ఎకరాల విస్తీర్ణాన్ని ప్లాట్లు వేసి కొందరు అనధికారిక లేఔట్లను ఏర్పాటు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై అనేక ఫిర్యాదులు అందాయన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్యాపిలి:** దేవరబండ సబ్‌స్టేషన్ పరిధిలోని ఏనుగుమర్రి ఫీడర్‌కు మరమ్మతులు చేపడుతున్న కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ వినయ్ తెలిపారు. ఏనుగుమర్రి, మెట్టుపల్లి గ్రామాల్లో బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. రైతులకు ఇచ్చే విద్యుత్ ఉదయం 5 గంటల నుంచి ఇవ్వనున్నట్లు తెలిపారు.

## యువర్ అటెన్షన్ ప్లీజ్..

# ఇచ్చట రైళ్లు ఆగవు!

టింగ్.. టింగ్.. ప్రయాణికులకు విజ్ఞప్తి.. బేతంచెర్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగవు. మీరు అవస్థలు పడుతూ నంద్యాల, డోన్ స్టేషన్‌కు వెళ్లి రైలు ఎక్కాల్సిందే. గతంలో ఇక్కడ స్టాపింగ్ ఉన్నా కోవిడ్ సమయంలో నిలిపివేశాం. ఆ తర్వాత పునరుద్ధరించలేదు. మీ ప్రాంతం నుంచి దూర ప్రాంతాలకు వెళ్లేందుకు అసౌకర్యానికి గురవుతున్నా మేము ఏమీ చేయలేం. రైల్వేశాఖ సహాయ మాజీ మంత్రి, ప్రస్తుత డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, ఎంపీ బైరెడ్డి శబరి స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళితే తప్పా మీ సమస్య పరిష్కారం కాదు. అసౌకర్యానికి చింతిస్తున్నాం!

- బేతంచెర్ల రైల్వేస్టేషన్‌లో ఆగని ఎక్స్‌ప్రెస్ రైళ్లు
- కోవిడ్‌కు ముందు స్టాపింగ్
- ఆ తర్వాత తీసివేసిన అధికారులు
- నంద్యాల, డోన్ స్టేషన్‌లకు వెళ్లాల్సిన పరిస్థితి
- దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు అవస్థలు

**గతంలో స్టాపింగ్ ఉన్న రైళ్లు**

నర్సాపూర్ అమరావతి ఎక్స్‌ప్రెస్ (17226)
అమరావతి ఎక్స్‌ప్రెస్ (18048)
కొండవీడు ఎక్స్‌ప్రెస్ (17212)
ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18464)

**బేతంచెర్ల:** పారిశ్రామిక కేంద్రమైన బేతంచెర్ల నాపరాయి, రంగురాళ్ల పరిశ్రమలకు ప్రసిద్ధి చెందింది. వివిధ రాష్ట్రాల నుంచి కార్మికులు ఉపాధి నిమిత్తం ఇక్కడికి వచ్చి స్థిరపడి ఉన్నారు. అయితే వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపకపోవడంతో కార్మికులతో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా బెంగళూరు, విజయవాడ, హౌరా, పుట్టపర్తి, హుబ్లీ, మచిలీపట్నం, యశ్వంత్‌పూర్, భువనేశ్వర్, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు వ్యాపారులు, విద్యార్థులు, కార్మికులు రాకపోకలు సాగిస్తుంటారు. కోవిడ్ ముందు ఆయా ఎక్స్‌ప్రెస్ రైళ్లను బేతంచెర్ల స్టేషన్‌లో నిలిపేవారు. 2020లో కోవిడ్ విజృంభనతో స్టాపింగ్‌ను ఎత్తివేశారు. కోవిడ్ తగ్గి సాధారణ పరిస్థితికి వచ్చి మూడేళ్లు దాటినా రైళ్లు ఆగడం లేదు. దీంతో జార్ఖండ్, బిహార్, మధ్యప్రదేశ్, ఒడిశా, రాజస్థాన్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, విద్యార్థులు, వ్యాపారులు నంద్యాల లేదా డోన్ రైల్వేస్టేషన్‌కు వెళ్లి రైళ్లు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది. పారిశ్రామిక కేంద్రమైన బేతంచెర్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపే విధంగా ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. కేంద్ర రైల్వేశాఖ సహాయ మాజీ మంత్రి, ప్రస్తుత డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డి, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి కేంద్ర రైల్వేశాఖ మంత్రితో మాట్లాడి బేతంచెర్ల రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బేతంచెర్ల రైల్వేస్టేషన్

### నూతన స్టేషన్ ఉన్నా రైళ్లేవి



విద్యుత్ లైన్ ఏర్పాటుతో పాటు నూతనంగా రైల్వేస్టేషన్ నిర్మించడం బాగుంది. అయితే రైళ్లు ఆగకపోవడంతో ఉపయోగం ఏం ఉంది. ఇప్పటికైనా బేతంచెర్ల పట్టణంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపితే ఆయా ప్రాంతాలకు ఉపాధి నిమిత్తం వెళ్లే కార్మికులు, విద్యార్థులు, వ్యాపారులకు సౌకర్యంగా ఉంటుంది.

–షాలీబేగ్, బేతంచెర్ల

### ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి



బేతంచెర్లలో గతంలో రెండు నిమిషాల పాటు ఎక్స్‌ప్రెస్ రైళ్లు అయిన అమరావతి, ప్రశాంతి, మచిలీపట్నం రైళ్లు ఆపేవారు. కరోనా తరువాత ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నా ఇక్కడ ఆపడం లేదు. మండలంలోని సీతారామాపురం, శంకలాపురం, యంబాయి, బైనపల్లె గ్రామాల్లో పూలు, కూరగాయలు అత్యధికంగా సాగుచేస్తుంటారు. వీటిని గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ ప్రాంతాలకు ప్రైవేటు వాహనాల్లో తరలిస్తుంటారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపితే రైతులకు సౌకర్యంగా ఉంటుంది.

–నందిపల్లె నారాయణ, అడ్వకేట్, బేతంచెర్ల

### ఇబ్బందులు పడుతున్నాం



ఇక్కడ స్టాపింగ్ లేకపోవడంతో గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి రైల్వే మంత్రి, అధికారులతో మాట్లాడి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చర్యలు తీసుకుంటే ఈ ప్రాంత వాసులకు ఉపయోగంగా ఉంటుంది. ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఎక్కాలంటే డోన్, నంద్యాలకు వెళ్లాల్సిన పరిస్థితి.

–భార్గవ్, బేతంచెర్ల

## పొదుపు మహిళలకు బుక్‌కీపర్ టోకరా

- రూ.50 వేలు మోసం.. కేసు నమోదు



నిందితుడు హనుమన్న

**డోన్ రూరల్:** పొదుపు సంఘం మహిళల నుంచి నగదు వసూలు చేసి బ్యాంకులో డిపాజిట్ చేయకుండా మోసం చేసిన బుక్ కీపర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు.. మండల పరిధిలోని చనుగొండ్ల గ్రామంలో ఐదు గ్రూపులకు చెందిన పొదుపు మహిళలు శ్రీనిధి పథకం కింద రూ.5.60 లక్షలు లోన్ తీసుకున్నారు. ప్రతి నెలా గ్రామంలో బుక్ కీపర్‌గా పనిచేస్తున్న తలారి హనుమన్న వద్ద కంతులు చెల్లిస్తున్నారు. అయితే అతను బ్యాంక్ రసీద్ కాకుండా ఒక పేపర్‌లో నగదు కట్టినట్టు రాసి ఇచ్చేవాడు. బ్యాంక్‌లో జమ కాకపోవడంతో మోసపోయామని తెలుసుకుని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. జరిగిన విషయాన్ని రూరల్ సీఐ రాకేష్‌కు వివరించారు. పొదుపు కార్యాలయం సిబ్బంది, హనుమన్నను స్టేషన్‌కు పిలిపించి విచారణ చేస్తున్నారు.

## సంక్షిప్తం

### మహిళలపై దాడులను అరికట్టాలి

**బేతంచెర్ల:** మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని.. ఇందు కోసం పటిష్టమైన చట్టాలను తీసుకురావాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పవన్, రాంబాబు అన్నారు. కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మంగళవారం బేతంచెర్ల పట్టణంలో ప్రభుత్వ పాలిటెక్నిక్, ఇంటర్, డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించారు. మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు. పీడీఎస్‌యూ నాయకులు సోహైల్, మున్నా, చరణ్ పాల్గొన్నారు.

### హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

**డోన్ టౌన్/డోన్ రూరల్:** కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌ను హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆర్టీటీ ఏరియా టీం లీడర్ నాగభూషణ్, ఎస్టీఎల్ అంతోని రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో డోన్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. అలాగే పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో ఏఐఎస్‌ఎఫ్, సీపీఐ మహిళా సమైఖ్య ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు పాల్గొన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద అర్బన్ అండ్ రూరల్ వైద్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కొత్త బురుజు ప్రాథమిక వైద్యశాల డాక్టర్ రాంభూపాల్, డాక్టర్లు శాబాజ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

**బనగానపల్లె రూరల్:** ఏపీటీఎఫ్, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బనగానపల్లెలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి మాట్లాడుతూ.. మహిళలపై దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

### ఆహారం విషయంలో అప్రమత్తత అవసరం

**కోవెలకుంట్ల:** ఆహారం తీసుకునే విషయంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ అన్నారు. అనకాపల్లిలో విషాహారానికి ముగ్గురు విద్యార్థినులు బలి కావడంతో మంగళవారం పట్టణ శివారులోని ఎస్సీ బాలికల వసతిగృహంలో ఆహారం తీసుకునే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు నాణ్యమైన ఆహారం తీసుకోవాలని, తీసుకునే ఆహారం సరిగా లేదని గుర్తిస్తే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. హాస్టల్ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన కూరగాయలు, ఆకుకూరలతో కూడిన ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు.

### అవుకులో భారీ వర్షం

**అవుకు:** మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం అర్ధరాత్రి భారీగా వర్షం కురిసింది. అర్ధరాత్రి ఒంటి గంటకు ప్రారంభమై వేకువజామున వరకు కురిసింది. అవుకులో 25.4 వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. కొండమీది గ్రామాల్లో కురిసిన వర్షానికి రిజర్వాయర్‌లో భారీగా నీరు చేరింది. పంటలు ప్రారంభ దశలోనే ఉండడంతో ప్రస్తుతానికి రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు.

### అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు

**ప్యాపిలి:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గణితం, వృక్షశాస్త్రం పోస్టులకు అతిథి అధ్యాపకులను నియమిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం తెలిపారు. ఎమ్మెస్సీలో 50 శాతం మార్కులు సాధించిన వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 24వ తేదీలోగా స్థానిక కళాశాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు. 26వ తేదీ డెమో, ఇంటర్వ్యూ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. అభ్యర్థులకు రూ. 10 వేలు చొప్పున వేతనం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

## ప్రభుత్వ స్థలాలను కొనుగోలు చేసి మోసపోవద్దు



జగనన్న కాలనీ సమీపంలో ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి

**కొలిమిగుండ్ల:** కొందరు ప్రభుత్వ భూములను ఆక్రమించి ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారని.. అలాంటి వారి వద్ద స్థలాలను కొనుగోలు చేసి మోసపోవద్దని నంద్యాల ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి సూచించారు. స్థానిక కస్తూర్బా పాఠశాల ఎదురుగా ఉన్న జగనన్న కాలనీ వద్ద ఇటిక్యాల రెవెన్యూలోని 738,765 సర్వే నెంబర్లలో ఆన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని మంగళవారం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వెంకటచెన్నయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. రెవెన్యూ సిబ్బంది ఇళ్ల స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వడంతో కొంత మంది ప్రజలకు ఇళ్ల స్థలాలను విక్రయించి రిజిస్ట్రేషన్ చేయించారని అన్నారు. మంజూరు చేసిన సర్టిఫికెట్లు ఇళ్ల కోసం రుణాలు తీసుకునేందుకు మాత్రమే ఉపయోగపడుతాయని తెలిపారు. స్థలాలపై వారికి ఎలాంటి హక్కు ఉండదని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం చేసిన రెవెన్యూ సిబ్బందితో పాటు దళారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇళ్ల స్థలాల విక్రయాలకు సంబధించి పూర్తి నివేదికను కలెక్టర్ అందిస్తామన్నారు. త్వరలోనే ఇళ్ల స్థలాలను కలెక్టర్ తనిఖీ చేస్తారని పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. యథేచ్ఛగా ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని నిర్మాణాలు చేస్తుంటే ఎందుకు ఆపలేకపోయారని సిబ్బందిని ప్రశ్నించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డి, డీటీ నాగేశ్వరరెడ్డి, మండల సర్వేయర్ సరిత ఉన్నారు.

### భారత్ బంద్‌ను జయప్రదం చేద్దాం

**డోన్:** ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం మాలమహానాడు తలపెట్టిన భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గ మాలమహానాడు గౌరవ అధ్యక్షుడు కుడిమెట్ల నారాయణ కోరారు. సంఘం కార్యాలయంలో మంగళవారం మహానాడు కార్యకర్తలతో మాట్లాడారు. బంద్‌కు అన్ని వర్గాలు సహకరించాలని కోరారు. సంఘం నాయకులు నాగేంద్ర, రాజశేఖర్ పాల్గొన్నారు.

### సారా బట్టీ ధ్వంసం

**బేతంచెర్ల:** మండల పరిధిలోని గోరుమానుకొండ సమీపంలో నాటుసారా స్థావరంపై దాడి చేసినట్లు సీఐ డి.వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ అశోక్ తెలిపారు. సారా తయారు చేస్తున్న చాకలి సాలన్నను అదుపులోకి తీసుకుని 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం డోన్ కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా సారా, అక్రమ మద్యం విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి వివరాలు సీఐ డి.వెంకటేశ్వరరావు, 9121101126, ఎస్‌ఐ అశోక్ 9121101127 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

### వ్యక్తి ఆత్మహత్య

**కొలిమిగుండ్ల:** మండల పరిధిలోని నందిపాడు ఎస్సీ కాలనీకి చెందిన చిన్న రంగయ్య(62) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. కొద్ది రోజుల నుంచి రంగయ్య అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. కొద్ది సేపటి తర్వాత కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం కొలిమిగుండ్లలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

### నూతన కార్యవర్గం

**బేతంచెర్ల:** పట్టణంలోని ఆదర్శ విద్యామందిర్ ఆవరణలో ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ డోన్ నియోజవర్గ కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మధుసూదన్, కార్యదర్శిగా రాజేష్ బాబు, కోశాధికారి నరసింహనాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## రోడ్డుపై నీరు.. నిలిచిన రాకపోకలు



పొట్టిపాడుకు వెళ్లే రహదారిలో వర్షపు నీరు చేరి నిలిచిన రాకపోకలు

**కోవెలకుంట్ల:** భారీ వర్షంతో మండలంలోని పొట్టిపాడు గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం సాయంత్రం పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఎగువ ప్రాంతాల్లోని వాగులు, వంకలు, పొలాల్లోని వర్షపు నీరంతా పొట్టిపాడు గ్రామానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిపై చేరింది. గ్రామ సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు లోతట్టు ప్రాంతంలో ఉండడం.. వర్షపునీరు ప్రవహిస్తుండడంతో రెండు రోజుల నుంచి గ్రామానికి రాకపోకలు స్తంభించిపోయాయి. ఈ రహదారిలో రాకపోకలు నిలిచిపోవడంతో గ్రామస్తులు గుళ్లదూర్తి మీదుగా రాకపోకలు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారిలో లోలెవల్ వంతెన ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇల్లు కూల్చివేత



శివవరంలో జేసీబీతో ఇంటిని కూల్చివేస్తున్న దృశ్యం

**అవుకు:** మండల పరిధిలోని శివవరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్త ఇంటిని పంచాయతీ, రెవెన్యూ, పోలీసు అధికారుల సమక్షంలో జేసీబీతో మంగళవారం కూల్చివేశారు. గుత్తి లలితమ్మకు గత ఏడాది మే 16వ తేదీ అవుకు రెవెన్యూ అధికారులు పొసిసెన్ సర్టిఫికేట్ అందించారు. దీంతో ఆమె ఇంటి నిర్మాణ పనులు చేపట్టింది. సుమారు రూ.10లక్షలు ఖర్చు పెట్టి స్లాబ్ వరకు పనులు పూర్తి చేసింది. ఇంతలోనే ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం ఏర్పడింది. దీంతో ఆమె ఇంటి నిర్మాణ పనులు ఆపి వేయాలంటూ టీడీపీ నేతల ప్రోద్బలంతో అధికారులు నోటీసులు జారీ చేశారు. వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుడు వ్యాపర్ల సుబ్బారెడ్డి సహాయంతో ఆమె కోర్టును ఆశ్రయించింది. ఇంతలోనే ఆమె, సహకరించిన సుబ్బారెడ్డిపై 16వ తేదీ అవుకు పోలీస్‌స్టేషన్‌లో రెవెన్యూ అధికారుల సంతకం ఫోర్జరీ చేసారంటూ కేసు నమోదు చేశారు. పోలీసులు వారి ఇద్దరిని అదుపులోకి తీసుకుని ఒకరిని కర్నూలు, మరొకరిని ఆళ్లగడ్డ సబ్‌జైల్‌కు తరలించారు. రెవెన్యూ, పంచాయతీ అధికారులు పోలీసుల సహకారంతో ఆ మహిళ ఇంటిని కూల్చివేసే ప్రయత్నం చేయడంతో గుత్తి లలితమ్మ భర్త ఐజయ్య, అక్క చిట్టెమ్మ, కుమార్తె ఎప్సిబా అడ్డుపడ్డారు. ఇంటిని కూల్చే ప్రయత్నం ఆపకపోవడంతో ఎప్సిబా తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో పోలీసులు వారి ముగ్గురిని అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇంటిని జేసీబీతో పూర్తిగా నేలమట్టం చేశారు. తహసీల్దార్ మల్లికార్జున రెడ్డిని వివరణ కోరగా .. శివవరం గ్రామం కంఠం నెంబరు.631లోని ప్రభుత్వం మరుగుదొడ్డిని గుత్తి లలితమ్మ ఆక్రమించి ఇంటి నిర్మాణ పనులు చేపట్టిందని.. అందుకే కూల్చివేసామన్నారు. అంతేకాకుండా గ్రామానికి చెందిన సుబ్బారెడ్డితో కలిసి రెవెన్యూ అధికారుల సంతకాన్ని ఫోర్జరీ చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

## వాతావరణ అనుకూల వ్యవసాయం చేయాలి



కటివానికుంట గ్రామంలో సాగు చేసిన కొర్ర, కంది పంటలను పరిశీలిస్తున్న డాక్టర్ కింజాంగ్

**బనగానపల్లె రూరల్:** రైతులు వాతావరణ అనుకూల పద్ధతుల్లో పంటల సాగు చేపట్టాలని దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంఘ దేశాల (సార్క్) రీజనల్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ కింజాంగ్ సూచించారు. ఆయన మంగళవారం బనగానపల్లె మండలంలోని యాగంటిపల్లె సమీపంలో కృషి విజ్ఞాన కేంద్రంలో అమలవుతున్న వాతావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులను పరిశీలించారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ధనలక్ష్మీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ కింజాంగ్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో రైతులు వాణిజ్య పంటలనే కాకుండా తక్కువ కాల వ్యవధిలో పండే కొర్ర, కంది తదితర పంటలను సాగు చేయాలన్నారు. నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవడం వల్ల భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయన్నారు. వాతావరణ అనుకూల పద్ధతుల ద్వారా మండలంలోని కటికవాని కుంట, ఫతెనగర్, చెర్లోకొత్తూరు గ్రామాల్లో సాగుచేసిన పంటలను పరిశీలించి, రైతుల అనుభవాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే కేవీకేలో పెరటి కోళ్ల పెంపకాన్ని పరిశీలించి మహిళలకు పెరటి కోళ్లను పంపిణీ చేశారు. జాతీయ మెట్ట పరిశోధన కో–ఆర్డినేటర్ డాక్టర్ జేవీఎస్ ప్రసాద్, సొసైటీ ఏఓ సురేష్‌కుమార్, కేవీకే శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

## యథేచ్ఛగా ఇసుక దోపిడీ

- అధికారులపై అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లు
- అక్రమార్జనకు తెరతీసిన టీడీపీ నేతలు



రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద నిలిపివున్న ఇసుక ట్రాక్టర్లు



అబ్బిరెడ్డిపల్లె చెరువు నుంచి మొరుసును తరలిస్తున్న ట్రాక్టర్లు

**డోన్:** టీడీపీ అధికారంలోకి వచ్చి మూడు నెలలు కాక ముందే తెలుగు తమ్ముళ్లు అక్రమ సంపాదనకు తెగబడుతున్నారు. డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి, బేతంచెర్ల, డోన్ మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో కర్ణాటక, తెలంగాణ మద్యం విక్రయాలు జోరుగా కొనసాగిస్తున్నారు. పలు గ్రామాలు, చెరువుల నుంచి గ్రావెల్(ఎర్రమట్టి)ని రియల్ ఎస్టేట్ వెంచర్లకు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఉచితంగా ఇసుక ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన వెంటనే టీడీపీ నాయకులు వెంకటాపురం, ఎస్ ఎర్రగుడి, చెరుకులపాడు, లక్ష్మంపల్లె, దొరపల్లె, కంబాలపాడుకు సంబంధించిన వాగులు, వంకలతో పాటు హంద్రీ నీటి పరివాహక ప్రాంతాల వద్ద విచ్చలవిడిగా ఇసుకను తోడి ట్రాక్టర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుక (4 టన్నులు) రూ.5 వేలు, ట్రాక్టర్ గ్రావెల్(మొరుసు) రూ.2,500 చొప్పున విక్రయిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. అడ్డు, అదుపు లేకుండా కొనసాగుతున్న ఈ గ్రావెల్, ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ, పోలీసు అధికారులు సాహసించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఒకటి, రెండు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేయాలనుకున్నా అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి వదిలివేయాల్సి వస్తోంది. సహజ సంపదను కొల్లగొట్టి అక్రమంగా లక్షలు ఆర్జిస్తున్న వారిపై ఉక్కుపాదం మోపాలని స్థానికులు కోరుతున్నారు.

## పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

**బనగానపల్లె రూరల్:** పరిసరాల పరిశుభ్రతను పాటించాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు అన్నారు. మంగళవారం అప్పలాపురం గ్రామంలో ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా గ్రామంలో ర్యాలీ, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవాలని సూచించారు. రాత్రిపూట దోమలు కుట్టకుండా దోమ తెరలు వినియోగించాలన్నారు.

### దోమలతోనే వ్యాధుల వ్యాప్తి

**బేతంచెర్ల:** దోమల వల్లే డెంగీ, మలేరియా, మెదడు వాపు, చికెన్ గున్యా లాంటి వ్యాధులు వస్తాయని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్యుడు అలీం అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని విద్యార్థులు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. దోమల రహిత సమాజం–ఆరోగ్యానికి సోపానం అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది అబ్దుల్ ఘపార్, రామాంజనేయులు, రాజ్యలక్ష్మి, రమ్య చంద్ర, లోకేశ్వరి, సర్వస్వతి, ఫార్మసిస్ట్ ఈగ్బాల్ హుసేన్ పాల్గొన్నారు.